క్లుప్తంగా

చెట్ల కొమ్మల తొలగింపు



అగ్నిమాపక శకటం పైనుంచి చెట్ల కొమ్మలు తొలగిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: పాలకొండ – పార్వతీపురం వయా రాయగడ ప్రధాన రహదారిలో రాజుపేట కూడలి వద్ద చెట్లు ప్రమాదకరంగా మారాయి. ఇదే ప్రాంతంలో ఉన్న వంతెన పాడవ్వడం, అలాగే చెట్ల కొమ్మలు మరీ కిందకు ఉండడంతో ముఖ్యంగా రాత్రి పూట లారీలు, బస్సులకు కొమ్మలు తగులుతున్నాయి. దీంతో అడపాదడపా ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు తన సిబ్బంది సహకారంతో శుక్రవారం చెట్ల కొమ్మలు తొలగించారు.

త్వరితగతిన వసతిగృహం పనులు



గర్భిణుల వసతిగృహం పరిశీలిస్తున్న పీఓ వీవీ రమణ

సీతంపేట: గర్భిణుల వసతిగృహ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ వీవీ రమణ తెలిపారు. వైటీసీలో ఏర్పాటు చేయనున్న వసతిగృహాన్ని శుక్రవారం పరిశీలించారు. మంచాలు, పరుపులు వంటివి నాణ్యమైనవి వేయాలని సంబంధిత సిబ్బందిని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, ఈఈ సింహాచలం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణమాసం పూజలు



పరుశురాంపురంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

కొమరాడ: మండలంలోని విక్రంపురం, పరుశురాంపురం, తదితర గ్రామాల్లో శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



హెచ్‌ఎంలకు పాఠ్య పుస్తకాలను అందజేస్తున్న ఎంఈఓ ఆనందరావు

వీరఘట్టం: మండలంలోని యూపీ, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు సెకెండ్ సెమిస్టర్ పాఠ్య పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్ వద్ద పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరగ్గా, ఎంఈఓ ఆర్. ఆనందరావు పర్యవేక్షించారు.

పరిహారం అందజేత



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురంటౌన్: బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, కష్టాల్లో మేమున్నామని భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. అచ్యుతాపురం ఘటనలో మృతి చెందిన పార్థసారథి కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. ప్రభుత్వం అందించిన కోటి రూపాయల పరిహారం చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజాం: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నామని కళాశాల ప్రిన్సిపాల్ కె.జనార్దన శుక్రవారం తెలిపారు. హిస్టరీ, ఎకనామిక్స్ సబ్జెక్టులలో పీజీ విద్యార్హత ఉండి, 50 శాతం మార్కులు కల్గి ఉండాలని వివరించారు. ఈ నెల 26లోగా బయోడేటాతో పాటు విద్యార్హత పత్రాలతో కళాశాలలో సంప్రదించాలని కోరారు.



భద్రత కల్పించాలి

ఆస్పత్రుల్లో సీసీ కెమేరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. మహిళా డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, ఏఎన్‌ఎంల కోసం ఆస్పత్రుల్లో విశ్రాంతి గదులు ఉండాలి. మహిళా సిబ్బంది కోసం మహిళా భద్రత సిబ్బందిని కూడా నియమించాలి. అప్పుడే వారికి భద్రత లభిస్తుంది.

– ఎం.బుద్ధేశ్వరరావు, వైద్యాధికారి, తాడికొండ పీహెచ్‌సీ



మనోధైర్యం దెబ్బతింటోంది

వైద్య ఆరోగ్య సిబ్బందిపై జరుగుతున్న దాడులు చూస్తుంటే మాలో మనోధైర్యం దెబ్బతింటోంది. సమాజంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యం కోసం అహర్నిశలు పనిచేస్తుంటాం. కోల్‌కతాలో జరిగిన ఘటనలు దేశంలో ఎక్కడా పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. నిందితులను కఠినంగా శిక్షించాలి.

– ఏపీ అర్చన, ఏఎన్‌ఎం, తాడికొండ పీహెచ్‌సీ



శాశ్వత ప్రయోజనాలే లక్ష్యం..

ప్రజలకు శాశ్వత ప్రయోజనాలు కలిగించే పనులను గుర్తించేందుకు ప్రభుత్వం పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించింది. ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టే పనులను ప్రజలందరి ఆమోదంతో నిర్వహించాలనే ఉద్దేశంతో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని పనులపై చర్చించారు. తాత్కాలిక ప్రయోజనాలను పక్కనబెట్టి ఎక్కువ మందికి శాశ్వత ప్రయోజనాలు కల్పించే పనులపై దృష్టి సారించారు. ఎక్కువగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు, శ్మశాన వాటికల అభివృద్ధి, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులు నిర్ణయించారు. –పాలకొండ/కురుపాం నెట్‌వర్క్



గరుగుబిల్లి: పెద్దూరులో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు



కొమరాడ: గుణానపురంలో గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మల్లికార్జునరావు, తదితరులు



వీరఘట్టం: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ



భామిని సర్పంచ్ రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు



గుమ్మలక్ష్మీపురం గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు



సీతంపేట: కుద్దపల్లి గ్రామసభలో పాల్గొన్న అధికారులు, ప్రజలు



పాలకొండ రూరల్: కొండాపురం గ్రామసభలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



జియ్యమ్మవలస: చింతలబెలగాం గ్రామసభలో పాల్గొన్న ఎంపీపీ సురేష్

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలం రస్తాకుంటుబాయిలోని కృషి విజ్ఞాన కేంద్రం (ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం) ద్వారా అందించే సాంకేతికతను జిల్లాలోని రైతులంతా అందిపుచ్చుకుని అధిక దిగుబడులు సాధించాలని ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ధ్రువ అన్నారు. ఈమేరకు ప్రోగ్రాం కోఆర్డినేటర్ సూచనల మేరకు కేవీకే శాస్త్రవేత్తలు శుక్రవారం గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లోని వంజరాపుగూడ, జే.కే పాడు, పాడి గ్రామాల్లో సాగు అవుతున్న (కేవీకే ద్వారా అందించిన విత్తనాలు) నల్ల రకం వరి–బీపీటీ 2841 రకాన్ని, వేరుశనగలో మేలైన కొత్త రకాలు కదిరిలేపాక్షి, విశిష్ట సామలలో చిరు సంచి రకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వరి దుబ్బు చేసే దశలో ఉందని, ప్రతీ రెండు మీటర్ల నాట్లకు 20 సెంటీ మీటర్ల వెడల్పులో కాలిబాటలు వేసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. అదేవిధంగా వేరుశనగ పూతదశలో ఉన్నందున ఎకరాకు 200 కిలోల జిప్సంను వేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు.

గురండిలో 'పొలంబడి'



రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ సింహాచలం

భామిని: మండలంలోని గురండిలో శుక్రవారం 'జీపీపీ పొలంబడి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ కె. సింహాచలం స్థానిక రైతులతో కలిసి సాగులో ఉన్న వరిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ, ప్రస్తుతం వరి పంటకు ఆకుముడత తెగులు ఆశిస్తోందని, ఈ విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అయితే ఇదే సమయంలో మిత్ర పురుగులైన సాలీడు, తూనీగలు ఎక్కువగా ఉన్నట్లయితే మందులు వాడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో జీపీపీ పొలంబడి ఫీల్డ్ ఆఫీసర్ కె.ఈశ్వర్, ఆడిటర్ ఎన్.దినేష్, వీపీఏ నిఖిల్, రైతులు సతీష్, ప్రసాదరావు, లక్ష్మీనారాయణ, నూకరాజు, సురేంద్ర, బికోరి, తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరి సేవలు ఎనలేనివి..

పాలకొండ రూరల్: న్యాయవాదిగా, పత్రికా సంపాదకుడిగా, కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం పంతులు అందించిన సేవలు ఎనలేనివని స్థానిక శాఖా గ్రంథాలయాధికారి బి.గణేష్‌బాబు అన్నారు. గ్రంథాలయంలో ఆవరణలో టంగుటూరి జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చదువుపై ఉన్న ఆసక్తితో వారాలు చేసుకుంటూ ఉన్నత చదువులు చదివిన వ్యక్తి టంగుటూరన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు, పాఠకులు పాల్గొన్నారు.



టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారుల, పాఠకులు

ఆధ్యాత్మిక భావనలు పెంపొందించేందుకే..

గరుగుబిల్లి: ప్రజల్లో ఆధ్యాత్మిక భావనలు పెంపొందించేందుకు హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని శ్రీసీతారామ భజన సేవా మండలి సభ్యుడు జి.చిన తిరుపతిరావు అన్నారు. మండలంలోని కొంకడివరం పంచాయతీ సీతారాంపురం గ్రామంలో శుక్రవారం తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూధర్మ ప్రచార పరిషత్ జిల్లా కన్వీనర్ జె.శ్యామ్‌సుందర్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, భగవద్గీత పఠనం, భజన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు జి.సూర్యకుమారి, బి.సుధారాణి, తదితరులు పాల్గొని భజన గీతాలు ఆలపించారు.



భగవద్గీత పఠనంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా అంతరిక్ష దినోత్సవం



విద్యార్థులు రూపొందించిన ఆర్యభట్ట ఉపగ్రహ నమూనాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

వీరఘట్టం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అంతరిక్ష దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆర్యభట్ట ఉపగ్రహం ఆకృతిని తయారుచేసి ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయుడు జి.లక్ష్మణరావు మాట్లాడుతూ, చంద్రయాన్ –3 విజయవంతం కావడంతో సెప్టెంబర్‌య 23న అంతరిక్ష దినోత్సవం జరుపుకుంటున్నట్లు చెప్పారు. ర్యాలీలో ఉపాధ్యాయులు కె.శివ, ప్రసాదరావు, ఎస్సై ఫక్రుద్దీన్, టీడీపీ నాయకుడు నిమ్మక పాండురంగ, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ పరీక్షలు పక్కాగా నిర్వహించాలి

పార్వతీపురంటౌన్:

ఐటీఐ పరీక్షల్లో అవకతవకలు జరగకుండా నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ కోరారు. ఈ మేరకు స్థానిక సుందరయ్య భవనం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీఐ యాజమాన్యాలు విద్యార్థుల నుంచి ఎగ్జామ్ హెల్పింగ్ ఫీజ్ పేరుతో రూ.5 వేల నుంచి రూ. 7 వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఐటీఐలు ఇటువంటి అక్రమాలకు పాల్పడుతున్నాయని ధ్వజమెత్తారు. తక్షణమే ఆర్‌డీడీ స్పందించి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేదంటే పరీక్ష కేంద్రాల వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు హరికృష్ణ, సాయికిరణ్, మనీ, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

• డీఈఓ పగడాలమ్మ

గరుగుబిల్లి: విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దడంతో పాటు వారికి వ్యవసాయంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ అన్నారు. 'మనబడి–మనతోట' కార్యక్రమంలో భాగంగా మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్టు ప్రాంగణంలో శుక్రవారం ఉపాధ్యాయులకు నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు విద్యార్థి దశనుంచే ప్రకృతిపై, ప్రకృతిలో లభించే వనరులపై అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను ఉత్పత్తి చేయడానికి ప్రకృతి వనరులను ఎలా ఉపయోగించుకోవాలో విద్యార్థులకు వివరించాలన్నారు. ప్రస్తుతం రసాయన ఎరువులతో పండిస్తున్న ఆహార ఉత్పత్తులను వినియోగించడం వల్ల అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయన్న విషయాన్ని విద్యార్థులకు వివరించాలన్నారు. జట్టు ట్రస్టీ డి.పారినాయుడు మాట్లాడుతూ.. 'బడి నుంచి పొలం బడికి' కార్యక్రమం ద్వారా వ్యవసాయంలో చోటు చేసుకున్న అనేక మార్పులు, విచ్చల విడిగా వినియోగిస్తున్న రసాయనాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో రీజనల్ థిమాటిక్ లీడ్ ప్రకాష్, రిసోర్సు పర్సన్ ఆర్.వాసుదేవరావు, ఎస్.బాలకృష్ణ, పి.రవీంద్రనాథ్, ఎం.నూకంనాయుడు తదితరులు ఉన్నారు.



గరుగుబిల్లి: మాట్లాడుతున్న డీఈఓ పగడాలమ్మ



జియ్యమ్మవలస: కన్నపుదొరవలస పాఠశాలలో ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈఓ

కన్నపుదొరవలస పాఠశాల సందర్శన

జియ్యమ్మవలస: మండలంలోని కన్నపుదొరవలస ఎంపీపీ పాఠశాలను డీఈఓ పగడాలమ్మ శుక్రవారం సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో కూరగాయల సాగు చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, లెస్సన్ ప్లాన్, డైరీని తప్పనిసరిగా నిర్వహించాలని, సకాలంలో సిలబస్ పూర్తిచేయాలని సూచించారు.

ప్రాథమిక విద్యే పునాది



మిర్తివలస డీపీఈపీ పాఠశాలను సందర్శించిన ఎంఈఓ

బలిజిపేట: విద్యార్థులకు ప్రాథమిక విద్య ఎంతో కీలకమైనదని, విద్యార్థులలో సామర్థ్యాలు పెంపొందించుకునేందుకు ఇదే పునాది అని ఎంఈఓ–1 సామల సింహాచలం అన్నారు. మండలంలో మిర్తివలస డీపీఈపీ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల నోట్ బుక్స్, వర్క్‌బుక్స్ పరిశీలించారు. బోర్డుపై అక్షరాలు రాసి విద్యార్థులతో చదివించారు. అకడమిక్ పుస్తకాల ప్రకారం వారిలో సామర్థ్యాలు పెరిగేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. ప్రతీ విద్యార్థికి పుస్తకాలు, యూనిఫాం, బెల్టులు, షూ అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనంలో మంచి పోషకాహారాన్ని అందించాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు.

యుద్ధప్రాతిపదికన ఇసుక మేటల తొలగింపు

• ఐటీడీఏ పీఓ. వీవీ రమణ

భామిని: మండలంలోని కాట్రగడ – బి వద్ద వంశధార నదిపై నిర్మించిన ఓపెన్ హెడ్ చానల్‌లో పేరుకుపోయిన ఇసుక మేటలను యుద్ధప్రాతిపదికన తరలించడానికి చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఇన్‌చార్జ్ ప్రాజెక్ట్ అధికారి వీవీ రమణ ఆదేశించారు. వంశధార ప్రాజెక్ట్ ఈఈ రామచంద్రమూర్తి, డీఈఈ భవానీశంకర్, ఏపీఎండీసీ ఏజీఎం కుమారస్వామి, ఆర్‌టీఓ వేణుగోపాలరావులతో కలిసి ఓపెన్ హెడ్‌చానల్‌ను శుక్రవారం సందర్శించి, పేరుకుపోయిన ఇసుక మేటలను పరిశీలించారు. వంశధార నది నుంచి వరదనీరు ప్రవేశించే సమయంలో ఇసుక మేటలు తరలివచ్చి పేరుకుపోతున్నాయని గుర్తించారు. హెడ్ రెగ్యులేటర్ ద్వారా సైడ్ వియ్యర్‌లో ఇసుక మేటలు నిండిపోవడంతో వరదకాలువలోకి నీరు పారడం లేదని వంశధార ఇంజినీర్లు వివరించారు. దీంతో ఇసుక మేటలను తొలగించాలని ఇన్‌చార్జ్ పీఓ రమణ ఏపీఎండీసీ అధికారులను ఆదేశించారు. అనంతరం నేరడి బ్యారేజ్ వద్ద ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని గుర్తించారు. వీరితో పాటు డీటీ నిమ్మల శేఖరం, మండల సర్వేయర్ రాజేశ్వరరావు, ఎంఆర్ఐ ఎస్. రాంబాబు, వీఆర్‌ఓ భారతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఇసుక మేటలపై చర్చిస్తున్న ఇన్‌చార్జ్ పీఓ రమణ, ఈఈ రామచంద్రమూర్తి, ఏజీఎం కుమారస్వామి

14న జాతీయ లోక్‌అదాలత్

బొబ్బిలి: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సెప్టెంబరు 14న నిర్వహిస్తున్నామని దీనిని విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ అన్నారు. స్థానిక కోర్టు హాల్‌లో పార్వతీపురం రెండో అదనపు జడ్జి ఎస్.దామోదరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు, పోలీసులతో శుక్రవారం జరిగిన సమావేశంలో జడ్జి మాట్లాడుతూ అన్ని రకాల సివిల్ కేసులు, రాజీ కాదగ్గ క్రిమినల్ కేసులలో కక్షిదారుల పరస్పర అంగీకారంతో రాజీ చేయాలని తెలిపారు. కోర్టు పరిధిలో పెండింగ్ కేసుల పరిష్కారానికి, కక్షిదారులకు సత్వర న్యాయం అందేందుకు ఈ లోక్ అదాలత్ దోహదపడుతుందన్నారు. రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకుంటే డబ్బు, సమయం రెండూ ఆదా అవుతాయన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి రోహిణీరావ్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పి.మోహనకుమార్, ఏపీపీ, ఏజీపీ, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవయవదానం మరొకరికి ప్రాణదానం

• మంత్రి సంధ్యారాణి



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు: అవయవదానం చేయడం వల్ల మరొకరికి ప్రాణదానం చేసినట్లని స్త్రీ, శిశు సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'మీకై మేము' వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవయవదానంపై అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అవయవదానం చాలా మంచి ఆలోచన అని అన్నారు. చనిపోయిన వ్యక్తుల అవయవాలను దానం చేయడం ద్వారా మరెందరికో ప్రాణదానం చేసినట్లు అవుతుందని వివరించారు. 'మీకై మేము' వెల్ఫేర్ అసోసియేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. అనంతరం కళాశాలలో నూతన ల్యాబ్‌ను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు వాడాడ గణేశ్వరరావు, అసోసియేషన్ సభ్యులు ఇప్పిలి దిలీప్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డా.ఉషశ్రీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.